18

# లేత గడ్డి

మనిషికి ఓ చోట ఓ పెద్ద తలకాయ కనబడింది. వెళ్లి దగ్గరగా నిలబడ్డాడు. నిజాయితీ గుర్తింపు కార్డు చూపాడు. పెద్ద తలకాయ పట్టించుకో లేదు. ఎటో చూస్తూ, అదోలా నవ్వుతూ వెళ్ళిపోయింది.

మరోసారి మరోచోట పెద్ద తలకాయ కనబడింది. మనిషి మనసు పీక్కుని కనబడకుండా జేబులో వేసుకున్నాడు. తలవంచి నిలబడ్డాడు. లాగు విప్పే ప్రయత్నం చేశాడు.

"సిగ్గు వదిలేస్తున్న దెవరబ్బా ?" అని పెద్ద తలకాయ ఆశ్చర్యంగా చూసింది. ఆ ధైర్యానికి, తెగువకు, చొరవకు అచ్చెరువొందింది. ప్రసన్నంగా చూసింది. మనిషి మొహమాటంతో రెపరెపలాడాడు. దీనమైన జీవితగాధ నాలుగు ముక్కలుగా, కాళ్ళమీద.... కుప్ప పోశాడు ! పెద్ద తల హృదయం బంగాళాఖాతమై పోయింది. దేవుడిలా "ఏం కావాలో కోరుకో" - అంది.

"ఆకలి మండిపోతోంది. అయితే అన్నం వద్దు. పని ఇప్పించండి చాలు" - అన్నాడు మనిషి. పెద్ద తలకు మనిషిలో 'బతక నేర్చినతనం' కొట్టొచ్చినట్టు కనబడింది. ఒక అనుచరుడు దొరికాడని ఆనందంతో వూగిపోయింది.

"పని చెప్తాను చేస్తావా ?" అంది పెద్ద తల. "మహాద్భాగ్యం మహాశయా ! అన్నాడు మనిషి. "ఇదిగో ఇక్కడ లేత లేత గడ్డి వుంది. ఇది కాస్తా కరువ్. నీక్కావల్సినంత డబ్బిస్తా"అంది పెద్దతల.

మనిషి పెద్దతల వైపు ఆరాధనా భావంతో చూశాడు. 'ఎంత గడ్డి కరిచి వుంటేనో.... అంత పెద్ద తల అయ్యింది." అని మనసు లోనే అనుకున్నాడు మనిషి. పనికి ఒప్పుకున్నాడు, తనది కూడా ఓ నాటికి పెద్దతల చేసుకోవాలన్న దృఢ సంకల్పంతో -

అప్పటినుండి మనిషి అయిన దానికీ, కాని దానికీ నానా గడ్డి కరుస్తున్నాడు.

మనిషిజీవితంలో దేన్నో అన్వేషిస్తూ, దేని కోసమో బతుకు తూనే ఉన్నాడు. ○

(మనిషి 'కత' లన్నీ రచన సచిత్ర మాసపత్రికలో ప్రచురితం)
1992-93